క్లుప్తంగా

ఘనంగా దాడితల్లి అమ్మవారి మారు జాతర



అమ్మవారి ఆలయంలో పూజలు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు బొబ్బిలిలోని శ్రీగొల్లపల్లి దాడితల్లి అమ్మవారి మారు జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గొల్లపల్లి, బైపాస్ రహదారిలోని రెండు ఆలయాల్లోనూ వేకువజాము నుంచి నిర్వహించిన పూజలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించి తరించారు. ఉదయం నుంచి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు మణికుమార్ శర్మ భక్తులకు పూజలు నిర్వహించారు.

రోడ్లపై చెత్త వేస్తే ఫైన్

బొబ్బిలి: రోజూ వస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి కాకుండా పట్టణంలోని రోడ్లపై చెత్తను పారబోసే దుకాణాల యజమానులు, ఇండ్ల యజమానులను గుర్తించి అపరాధ రుసుం విధించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సచివాలయ, మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని కృష్ణా థియేటర్ రోడ్డు, ఆంజనేయ స్వామి ఆలయం, జూబ్లీ రోడ్, అడ్డు అగ్రహారం వీధుల్లో మున్సిపల్ సిబ్బందితో కలసి ఆయన మంగళవారం పర్యటించారు. పలుచోట్ల రోడ్లపై చెత్తను గుర్తించిన కమిషనర్ వేసే వారిని గుర్తించాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఎస్ఈబీ సోదాలు

బొబ్బిలి: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలోని సిబ్బంది గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులు, ఇతర అనుమానిత వ్యక్తుల లగేజీలను తనిఖీ చేశారు. గంజాయి రవాణా నిషేధమని, వ్యక్తులు జైలు పాలవుతారని హెచ్చరించారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

బాడంగి: మండలంలోని తెంటువలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్టు జెడ్పీటీసీ పెద్దింటి రామారావు మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

సేవా సంఘం ఔదార్యం

మెంటాడ: మండలంలోని పోరాంలోవ గ్రామానికి చెందిన మెంటాడ అప్పలనాయుడు ఇటీవల పక్షవాతంతో మంచాన పడటంతో ఆయన కుటుంబానికి ఆసరాగా మాతృభూమి సేవా సంఘం అండగా నిలిచిందని సంఘ కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు అన్నారు. మంగళవారం సంఘం తరఫున నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు.

భవన నిర్మాణ కార్మికులంతా సంక్షేమ సంఘంలో చేరండి

రేగిడి: భవన నిర్మాణ కార్మికులంతా వైఎస్సార్ బీమా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘంలో చేరండి అని రాజాం లేబర్ ఆఫీసర్ డి.కొండలరావు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెంనాయుడు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన మండలంలో మొత్తం 522 మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నట్లు గుర్తించామని, వీరంతా కార్మిక సంక్షేమ సంఘంలో చేరేలా చూడాలన్నారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు వయసు ఉన్న వారంతా ఈ సంఘంలో చేరి, ప్రభుత్వ సదుపాయాలు పొందాలన్నారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులను మంగళవారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా క్రాస్ ప్రోగ్రాం ద్వారా ఈ పనులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్‌కుమార్ తెలిపారు.

రాజాం: క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని పొగిరి గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లును బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. మొత్తం మూడు బోర్లు బాగు చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజేష్ వెల్లడించారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి

బొబ్బిలి: భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునకాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ, పీకేఎస్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ,తదితర సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు పనితీరు మార్చుకోవాలి

- ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలి
- ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు బాగస్వాములవ్వాలి
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు తమ పనితీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు సూచించారు. అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశపు భవనంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంళవారం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఏవో వెంకటయ్య తమ శాఖకు సంబంధించిన నివేదిక చదివి వినిపిస్తుండగా గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఏ మేరకు పరిష్కరించారో చెప్పాలని ఎమ్మెల్యే అడగడంతో ఏవో సరైన సమాధానం చెప్పలేక నీళ్లు నమలడంతో పాటు వ్యవసాయానికి సంబంధించి నివేదికలోని అంశాలను సరిగా వివరించలేకపోయారు. పలువురు అధికారులు తమ నివేదికలు చదివి వినిపించగా నివేదికలు సంతృప్తికరంగా లేవని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. స్వపక్షంలోని సభ్యులైన, ప్రతిపక్షం సభ్యులైన అడిగిన ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానాలు చెప్పాలన్నారు. సర్వసభ్య సమావేశాన్ని ఈజీగా తీసుకోవద్దని, సభ్యులు లేవనెత్తిన సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశానికి వచ్చే ముందు తమ శాఖలకు సంబంధించిన సరైన నివేదికలు తయారు చేసుకుని రావాలని తెలియదా? అని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోకుంటే ఇబ్బందులు పడతారన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని, రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులకు కొరత లేకుండా ఇండెంట్ పెట్టాలని వ్యవసాయాధికారులకు సూచించారు. ఎస్. సీతారాంపురంలో జగనన్న కాలనీకి రహదారి సౌకర్యం కల్పించాలని, అడ్డంకులు వస్తే పోలీస్ సిబ్బందితో కలిసి వెళ్లి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ సుబ్బారావుకు సూచించారు. జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఎంపీడీఓ రమామణి, తహసీల్దార్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి

రాజాం: అధికారుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమని, అన్ని శాఖల అధికారులు ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సాధారణ సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని, వీటిని క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరికీ అందించాల్సిన బాధ్యత మండలంలోని ప్రతీ అధికారిపై ఉందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో జవాబుదారీతనం ఉండాలని, ప్రతీ సమాచారం అక్కడ పొందుపరచాలన్నారు. రాజాం ప్రాంత అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని, ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. అధికారులు తమ శాఖల ద్వారా వస్తున్న సంక్షేమ నిధుల వివరాలను పంచాయతీల్లోని ప్రజాప్రతినిధులకు వివరించాలన్నారు. అంతకుముందు గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరుపై పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. ఎలక్ట్రికల్ లైన్‌మేన్ అందుబాటులో ఉండడం లేదని కంచరాం సర్పంచ్ గెద్దాపు సుబ్బమ్మ.. ఏఈ సురేష్‌కుమార్‌ను నిలదీశారు. వైకేపీ నందబలగ సీఎఫ్ తమకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని సర్పంచ్ ఈశ్వరరావు ఏపీఎం దధికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని పంచాయతీల్లో సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులకు రావడం లేదని మరికొంతమంది ఉన్నతాధికారులకు తెలియజేశారు. వీటిపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.సులోచన, జెడ్పీటీసీ బి.నర్సింహులు, వైస్ ఎంపీపీలు ఎన్.వర్షిణి, వై.సునీత, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, ఎంపీడీఓ బి.శంకరరావు, తహసీల్దార్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రాజాం: మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

మహిళల స్వయంసమృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



రాజాం సిటీ: యువతికి టైలరింగ్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం సిటీ: మహిళల స్వయంసమృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని, దానిని ప్రతీ ఒక్క మహిళ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు కోరారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు మహిళలకు సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు నూతనంగా శిక్షణలో జాయిన్ అయిన వారికి టైలరింగ్ కిట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీ మహిళ ఆర్థికంగా బలోపేతం కావడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, దీనికోసం మహిళలను అనేక పథకాల ద్వారా ప్రోత్సహిస్తున్నారన్నారు. ఖాళీగా ఉన్న మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పొంది, స్వయం ఉపాధి సాధించాలన్నారు. నియోజకవర్గంలోని మూడు కేంద్రాల్లో నిష్ణాతులైన ట్రైనర్లచే శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలను మహారాణులను చేసేందుకు సీఎం జగనన్న అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ ఎల్. రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, ఏసీ ఎ.చిరంజీవి, ఏపీఎం టి.దధికుమార్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఎస్.అరుణ, టైలరింగ్ కో-ఆర్డినేటర్ కృష్ణవేణి, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి పాలిసెట్‌కు పక్కా ఏర్పాట్లు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కోఆర్డినేటర్, ఇతర సిబ్బంది

బొబ్బిలి: పాలిసెట్ ప్రవేశ పరీక్షకు బొబ్బిలిలో అన్ని ఏర్పాట్లు చేశామని పరీక్షల కో ఆర్డినేటర్ పి.అనూరాధ తెలిపారు. ఆమె పట్టణ, మండల ప్రాంతాల్లో ఉన్న పరీక్షల కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల సిబ్బంది, పరీక్షల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించి సూచనలు చేశారు. కోమటిపల్లిలోని భాస్కర పాలిటెక్నిక్ కళాశాల, కలువరాయిలోని స్వామి వివేకానంద ఇంజినీరింగ్ కళాశాల, పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాల, తాండ్ర పాపారాయ జూనియర్ కళాశాల, గాయత్రి జూనియర్ కళాశాల, శ్రీసాయి డిగ్రీ కళాశాల, ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాల, ఇందిరా గాంధీ డిగ్రీ కళాశాల, శ్రీ విద్యా జూనియర్ కళాశాలలో పాలీసెట్‌కు 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకూ పాలీసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు కోఆర్డినేటర్ తెలిపారు. అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎన్.సుధీర్‌బాబు, ఆయా పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని



తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొన్న గిరిజనులతో తమ్మినేని

మెంటాడ: భూసమస్యలు పరిష్కారమయ్యే వరకూ తమ పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వంటా వార్పు - నిద్ర కార్యక్రమం ద్వారా నిరసన చేపట్టారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత ముత్తాల నుండి గిరిజనులు గిరిజనేతరుల నుండి పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని వారందరికి పాస్ పుస్తకాలను మంజూరు చేయాలని కోరారు. గిరిజనులకు పట్టాలు మంజూరయ్యే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గుమ్మిడి సింహాచలం, చిలక సన్యాసి, గేదెల పెదరాము, రాకోటి రాములు, సీహెచ్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సిరిమాను సంబరం



నందబలగలో సిరిమానోత్సవం

తెర్లాం: మండలంలోని నందబలగ గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ, చిన, పెదపోలమ్మ పండగ సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన సిరిమానోత్సవం అంబరాన్ని తాకింది. సిరిమానును పూజారి ఎం.కృష్ణ అధిరోహించగా గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగించారు. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు నందబలగ గ్రామస్తులతో పాటు మధుర గ్రామాలైన చిన నందబలగ, రామన్నవలస గ్రామాలతో పాటు, చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పండగ సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో తెర్లాం ఎస్ఐ ఆర్.రమేష్ పలు పోలీస్ స్టేషన్ల సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు వచ్చి పూజలు చేశారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు వచ్చి సిరిమానోత్సవాన్ని తిలకించి, అమ్మవార్లకు పూజలు చేశారు.

అసిరితల్లికి ప్రత్యేక పూజలు

రాజాం సిటీ: గ్రామదేవత పండగ సందర్భంగా మండలంలోని ముద్దాడ జోగివలస గ్రామదేవత అసిరితల్లిని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం మరింత బాగుపడాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బి.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి

రేగిడి: త్వరితగతిన నాడు-నేడు పనులు(ఫేజ్-2) పూర్తి చేయాలని ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎంఈఓ ఎంపీ ప్రసాదరావు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారితో సమావేశమైన ఆయన ప్రతిరోజూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి, పనులను పర్యవేక్షించాలని తెలిపారు. సెలవులు పూర్తయ్యే నాటికి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

విద్యార్థుల చేరికపై దృష్టిసారించాలి

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై హెచ్ఎంలు ప్రత్యేక దృష్టిసారించాలని ఎంఈఓ పి.నాగయ్య సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశమైన ఆయన బడిఈడు పిల్లలంతా సెలవుల తర్వాత పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. అలాగే మనబడి నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్నవారినే పనులకు అనుమతించాలి

రేగిడి: జాబ్‌కార్డు ఉన్న వారినే ఉపాధి హామీ పనులకు అనుమతించాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు సూచించారు. మంగళవారం మండలంలోని తోకలవలస, వావిలవలస, లింగాలవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనికి వచ్చేటప్పుడు వెంట తాగునీటి బాటిల్ తీసుకురావాలన్నారు. వేతనదారులందరికీ వంద రోజుల పని దినాలు కల్పించి, గిట్టుబాటు అయ్యే వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గర్భిణులకు అన్నదానం

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం మండలంలోని పలు గ్రామాల నుంచి రేగిడి పీహెచ్‌సీకి మంగళవారం విచ్చేసిన గర్భిణులకు రేగిడి సత్యసాయి భజన మండలి సభ్యులు అన్నదానం చేశారు. దాదాపు 60 మందికి పౌష్టికాహారం అందజేశామని భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తెలిపారు.

పెండింగ్ చలానాలపై ప్రత్యేక డ్రైవ్

రాజాం సిటీ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనాల పెండింగ్ చలానాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డు, బొబ్బిలి రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టామని, గతంలో విధించిన చలానాలను వసూలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.నీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

బొబ్బిలి: మండలంలోని నారాయణప్పవలసకు చెందిన ఏడో తరగతి విద్యార్థి తీళ్ల మనోజ్ భానుకుమార్ సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ విలేకర్లకు తెలిపారు.

పేదల కుటుంబాల్లో నవరత్నాల వెలుగులు

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



లబ్ధిదారునికి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మెంటాడ: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో విడతలో భాగంగా పులిగుమ్మి, గురమ్మవలస గ్రామాల్లో ఆయన మంగళవారం పాల్గొన్నారు. జగనన్న ఎన్నికల ముందు జరిగిన సంకల్ప యాత్రలో అడుగడుగునా పేదల కష్టాలను వింటూ చలించిపోయారని, వారి కష్టాలు తీర్చేందుకే ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు ప్రతిపక్షాలకు ఏమీలేక ప్రభుత్వ పథకాలపై విరుచుకు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి బుద్ధి చెప్పి, వైఎస్సార్‌సీపీకే మళ్లీ పట్టం కడతారన్నారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ప్రజలు జగనన్నను తమ పెద్ద కొడుకులా చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మణ్యపురి గీతాలత, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

దుర్గమ్మల దీవెనలు అందరిపైనా ఉండాలి

- బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి



నందబలగలో శ్రీ కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని నందబలగ గ్రామ దేవతలైన శ్రీ కనకదుర్గమ్మ, శ్రీ చిన, పెదపోలమ్మ అమ్మవార్ల చల్లని దీవెనలు ప్రతీ ఒక్కరిపైనా ఉండాలని, ఆ తల్లులందరూ ఎల్లవేళలా ప్రజలను కంటికి రెప్పలా కాపాడాలని తాను వేడుకున్నానని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శ్రీ కనకదుర్గమ్మ, చిన, పెదపోలమ్మ అమ్మవార్ల పండగ సందర్భంగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల పిలుపు మేరకు మంగళవారం ఆయన గ్రామానికి వెళ్లి శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా ఎల్లప్పుడూ సుఖశాంతులతో ఉండాలని, గ్రామ దేవతల ఆశీర్వాదం అన్ని వేళలా నందబలగ గ్రామ ప్రజలతో పాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలపై ఉండాలన్నారు. నందబలగలో శ్రీ కనకదుర్గమ్మ, చిన, పెదపోలమ్మ అమ్మవార్ల పండగను ఎంతో వేడుకగా గ్రామస్తులంతా ఐకమత్యంతో జరుపుకోవడం అభినందనీయమన్నారు.

సెలవుల్లోగా నాడు - నేడు పనులు పూర్తి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు - నేడు పథకం పనులు వేసవి సెలవులు పూర్తయ్యేలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం నాడు - నేడు పనులపై పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్‌పీలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు అధికారుల, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రెండో విడత నాడు - నేడు పథకం కింద ఏయే పాఠశాలలకు పనులు మంజూరయ్యాయో ఆయా పాఠశాలలో పనులన్నీ వేసవి సెలవులు పూర్తయ్యేలోగా శతశాతం పూర్తి చేయాలన్నారు. అందుకు అవసరమైన చర్యలు హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాల ప్రారంభం నాటికి ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలోను, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతిలో శతశాతం విద్యార్థులు చేరేలా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంఈఓ త్రినాధరావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మంజూరు చేస్తారని, దీనిపై వెలుగు వీఓఏలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామాల్లో తెలియజేయాలని సూచించారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: గర్భిణులు వారి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాట్లాడుతూ గర్భిణులు ప్రతీ రోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, వైద్యుల సూచనల మేరకు ప్రతీనెలా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దీక్షితారాణి మాట్లాడుతూ గర్భిణులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. గ్రామాల్లో జరిగే ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలోనైనా వైద్య సేవలు పొందాలని సూచించారు. అనంతరం గర్భిణులకు స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో పౌష్టికాహారాన్ని అందజేశారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆదినారాయణ కాలనీ, గరల్స్ జూనియర్ కళాశాల, సారథి రోడ్డు, గణేష్ నగర్, తిరుమల నగర్, ప్రశాంతి నగర్‌లలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేసేదన్నారు. నీరు-చెట్టు పథకం పేరిట ప్రజాధనాన్ని టీడీపీ దోపిడీ చేసుకుందని విమర్శించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లోనూ గెలిపించి, మరోసారి ఆయనను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చేరిన పిల్లలకు విద్యా బోధన చేస్తామని చెబుతూ మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండలంలోని గంగన్నపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కోరుతున్నారు. మంగళవారం గంగన్నపాడు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రసాదరావు, సహోపాధ్యాయులు రాము, శ్రీనివాసరావు అంగన్‌వాడీ కేంద్రాలకు, విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పించాలని కోరారు.

రామభద్రపురం: రానున్న విద్యా సంవత్సరంలో బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో తిరుమలప్రసాద్ అన్నారు. స్థానిక ఎంఆర్సీ భవనంలో ప్రభుత్వం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే విద్యాబోధన, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. బడిలో చేరని, డ్రాపవుట్, బాలకార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని వివరించాలన్నారు. మనబడి నాడు - నేడు కింద పాఠశాలల్లో చేపడుతున్న పనులను జూన్ 11వ తేదీలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



రాజాం: కలశాలలతో పవిత్ర నదీజలాలు తీసుకు వస్తున్న మహిళలు

రాజాం: పట్టణ పరిధిలోని కొండంపేట గ్రామంలో శ్రీధర్మశాస్తా హిరహరసుత అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలిరోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా విగ్రహాల గ్రామ ప్రదక్షిణ, యాగశాల హోమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముద్దాన సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో కొత్తగా నిర్మించిన గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, శ్రీసత్యనారాయణస్వామి, నవగ్రహాల, దత్తాత్రేయ, నాగబంధ, షిర్డీసాయి, సత్యసాయి ఆలయాల ప్రారంభోత్సవం మంగళవారం నిర్వహించారు. వేదపండితులు అంపోలు రుద్రకోటేశ్వరరావు శర్మ, రామప్రసాద్ శర్మలతో పాటు గ్రామ పురోహితులు పులఖండం శ్రీనివాసరావు శర్మల పర్యవేక్షణలో ఉదయం విగ్రహాల గ్రామ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, జలాధివాసం, యాగశాల హోమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా రాజాం బాల సంస్కార్ కేంద్రం చిన్నారులు, బొద్దాం గ్రామ చిన్నారులు చేసిన కోలాటం ఆకట్టుకుంది.